
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

గుంటూరు
జిల్లా వార్తలు

5

బుధవారం 9 ఏప్రిల్ 2025

మిస్సింగ్ సిటిజన్స్
గుర్తింపు

8
● ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
● ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్ ● ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట



గ్యాస్ వడ్డన.. రూ.90 కోట్లు

● వినియోగదారులపై పెరిగిన భారం
● రెండేళ్ల తర్వాత వంట గ్యాస్‌పై వడ్డన
● ఉజ్వల, దీపం లబ్ధిదారులనూ వదలని ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండేళ్ల తర్వాత వంట గ్యాసు సిలిండరు ధర పెంచారు. గ్యాసు ధర పెరగడంతో సామాన్య కుటుంబాలపై భారం పడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 18 లక్షల కుటుంబాలకు వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడు ఏడాదికి 8 నుంచి 10 సిలిండర్లు వినియోగిస్తారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై ఏటా రూ.500 భారం పడుతోంది. ఇలా 18 లక్షల మందిపై ఏడాదికి రూ.90 కోట్ల మేర అదనంగా భారం పడనున్నది. ఉజ్వల, దీపం పథకాల కింద కనెక్షన్లు తీసుకున్న వారిని కూడా ఈ సారి ప్రభుత్వం వదల్లేదు. దీంతో వారు కూడా ఈ గ్యాస్ భారం మోయాల్సి వస్తోంది. వంటగ్యాసు ధరల భారాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి సామాన్యులపై భారం తగ్గిస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపేలా చేస్తుండడంతో వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సామాన్యులు గగ్గోలు..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు ధరలు డజనుసార్లు పెరిగాయి. 2014 నాటికి 7 పదుల్లో ఉన్న ఆయిల్ ధరలు 2020 నాటికి 120 రూపాయల వరకూ వెళ్లింది. కరోనా కష్టాలతోపాటు, లాక్‌డౌన్ నష్టాలతో అల్లాడిపోయిన ప్రజలు ఆయిల్ ధరల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం ధరలు తగ్గించింది. వంటగ్యాసు ధర 2014 నాటికి రూ.430 ఉండగా, 2023కి రూ.1200కి చేరింది. దీంతో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రూ.200 ధర తగ్గించి ప్రజల ఆగ్రహ జ్వాలను చల్లార్చింది. కాగా మళ్లీ ఇప్పుడు ధరలు పెంచడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ధరల పెంపుదల ఇంతటితో ఆగుతుందా.. లేక ఇంకా ఇంకా కొనసాగుతుందా.. అన్న భయం వారిని వెంటాడుతోంది. 2014- 16 మధ్య కేంద్రం 9 సార్లు ధరలు పెంచిన నేపథ్యంలో ఆ పరిస్థితిని తలుచుకుని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.



ఆస్తి పన్ను.. మళ్లీ పెరిగింది

మున్సిపాల్టీల్లో 15 శాతం పెరుగుదల

ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆస్తి పన్ను

1 నుంచి అమల్లోకి వచ్చిన పెంచిన పన్ను

మూడు జిల్లాల్లో భారం రూ.60 కోట్లు పైగానే

మున్సిపల్ కేంద్రాల్లోని ఇళ్ల యజమానులపై మళ్లీ పన్ను భారం పడింది. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను మరో సారి 15 శాతం పెరిగింది. ఈ పెంచిన పన్నులను ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల మూడు జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.60 కోట్లకు పైగానే ఆస్తి పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటేటా పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానమయ్యే వరకు పన్ను పెరుగుతునే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో మోయలేని పడుతున్న ఆర్థిక భారం మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ ప్రజలపై మరోసారి ఆర్థిక భారం పడింది. ఏటా పన్నుల పెంపుదల పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మర్చేసింది. మార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి పన్నును విధించింది. ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా మున్సిపాల్టీల్లో అధికారులు ఆస్తి పన్ను నిర్ణయించారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీలో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునేవారు. మున్సిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15 శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి తన గతంలో ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా ఐదో ఏడాది కూడా పన్ను పెరిగింది. ఇలా పెరిగిన పన్నుతో అ ది రూ.990కి చేరింది. అంటే నాలుగేళ్లలో ఆ వ్యక్తిపై అదనంగా రూ.498 పన్ను భారం పడింది. గుంటూరు కార్పొరేషన్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు ఉంటే ఈ పన్ను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.115కు పెరిగింది. అంటే మిగిలిన మున్సిపాల్టీల్లోనూ ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50 శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50 శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరు నెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీను పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్ను దారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.

కొనసాగుతున్న వైసీపీ పన్ను విధానం

మున్సిపాల్టీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15 శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వంలో పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. అయితే ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు ఈ నెలలో పెరిగిన 15 శాతం పన్నుతో తేలింది. గత నాలుగేళ్లుగా పెంపుదలతో ఇప్పటికే పన్ను భారం ప్రతీ ఒక్కరిపైనా రెట్టింపు అయింది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

5 శాతం రాయితీ

పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5 శాతం రాయితీ అమలు చేస్తోంది. సోమ వారం నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. పన్ను రూ.100 ఉంటే రూ.5 రాయితీ ఇస్తారు. రాయితీపై ఆస్తి పన్ను చెల్లించేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చారు. పన్ను రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు కడుతున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లోనే రూ.6.60 కోట్లు వసూలు కావడం గమనార్హం.



ఆస్తి పన్ను లక్ష్యం రూ.522.28 కోట్లు

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.522.28 కోట్లు. ఈ మొత్తంలో బకాయిలు భారీగానే ఉన్నాయి. పల్నాడు జిల్లా పన్ను వసూ లు లక్ష్యం రూ.77.03 కోట్లుగా ప్రభుత్వం నిర్ణ యించింది. గుంటూరు జిల్లాల్లో రూ.406.97 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉంది.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

● ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పంపిణీ ప్రారంభం
● ఒక్కో విద్యార్థికి రూ.3 వేలకిపైగా భారం నుంచి ఊరట
● ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 8 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 30 పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్లస్ టూ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ చదివే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలల పునః ప్రారంభం కాగా కళాశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను అధ్యాపకులు అందజేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారే. పుస్తకాలకు విద్యార్థులు రూ.3 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రెండేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, రికార్డులు పంపిణీ వల్ల ఆర్థికంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతగా మారింది. పుస్తకాలను ఉచితంగా అందజేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందని ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు.

ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం


ప్రభుత్వం ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతుంది. ఈ నేపథ్యంలోనే నూతన సంస్కరణలు ప్రవేశపెడుతున్నది. తొలుత ఇంటర్ విద్యార్థులకు కూడా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌తో పాటు ఎంసెట్ శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా శిక్షణలకు గుంటూరులోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్కరణలు విద్యార్థుల అడ్మిషన్లు పెంపుకోసమేనని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

8
ఎంఈవోల వసూళ్ల దందా
● విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు మీదగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు
6

టూరిజం మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

నేడు వెలగపూడిలో సీఎం చంద్రబాబు ఇంటికి భూమి పూజ
ఉదయం 8.50 గంటలకు ముహూర్తం
6

సేవలపై సంతృప్తి
● ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా! ● పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి ● ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి

8


రీ సర్వేపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలి

● రీ సర్వేపై ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూములు రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ప్రత్యక్ష పరిశీలనలో కొలతల వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద భూముల రీసర్వే జరుగుతున్న మండలాల రీ సర్వే తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లకు మంగళవారం కలెక్టరేట్లోని మినీ శంకరన్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూములు రీసర్వే జరుగుతున్న 14 గ్రామాల్లో క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వే పూర్తయినందున వాటికి సంబంధించిన గ్రౌండ్ ట్రూథింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదును వెంటనే ప్రారంభించాలన్నారు. తప్పులు లేకుండా భూ యజమానుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో భూముల వివరాల నమోదుకు సంబంధించి డీటీలు వీఆర్వోలు సర్వేయర్లు తెలియజేసిన పలు సందేహాలను ఇన్‌చార్జి కలెక్టర్ నివృత్తి చేశారు. గ్రౌండ్ ట్రూథింగ్ మాడ్యులర్‌లో వివరాలు నమోదు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఈ-డిస్ట్రిక్ మేనేజర్ రత్నం, మాస్టర్ ట్రైనర్ పున్నారావు వివరించారు.


మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ట్రాఫిక్‌పై ఎస్పీ దృష్టి

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎస్పీ సతీష్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి గాంధీపార్కు సెంటర్, హిమనీ సెంటర్, కార్పొరేషన్ కార్యాలయం, పండ్ల మార్కెట్, పల్నాడు బస్టాండ్, ఎత్తురోడ్డు వరకు కాలినడకన ట్రాఫిక్‌ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.?, ఎవరి వల్ల వస్తున్నాయి..?, ఏయే సమయాల్లో వస్తున్నాయి..?, ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు మున్సిపల్, రోడ్డు రవాణా, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి ప్రణాళికలను రూపొందించాలని ఎస్పీ డీఎస్పీ సీతారామయ్య, లాలాపేట సీఐ శివప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, ఈస్ట్ ట్రాఫిక్ ఎస్ఐ విజయకుమార్‌రెడ్డిలకు సూచించారు.

రూ.10 స్టాంప్.. రూ.60

◆ నాన్ జుడీషియల్ స్టాంప్‌లకు కొరత
◆ బ్లాక్‌మార్కెట్లోనూ రెండు నెలలుగా ఇబ్బందులు
◆ పరిస్థితి దారుణంగా మారినా స్పందించని రిజిస్ట్రేషన్ అధికారులు
◆ డీఆర్ కార్యాలయంలో ఉన్నా పంపిణీ చేయకపోవడంపై అనుమానాలు
◆ ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనం కోసమేనని ఆరోపణలు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాన్ జుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడచిన నాలుగు నెలలుగా మార్కెట్‌లో కొరత తీవ్రంగా ఉంది. మొదటి రెండు నెలలు తమ వద్ద ఉన్న కొద్దిపాటి స్టాంప్‌లను వెండర్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లోనూ నిండుకున్నాయి. అయితే రెండు నెలలుగా బ్లాక్‌లో కూడా స్టాంప్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మంది స్టాంపు వెండర్ల వద్ద స్టాంపులు లేవు. ఉన్న వారు రూ.10 స్టాంప్‌ను రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. పరిస్థితి దారుణంగా తయారైన రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించి రిజిస్ట్రేషన్ 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. నాన్ జుడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ-స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చివరకు ఈ-స్టాంపింగ్‌ను కూడా ప్రైవేటు ఏజెన్సీకే కేటాయించారు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తం అయినా ప్రభుత్వం ముందుకే వెళ్లింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జుడీషియల్ స్టాంప్‌ల వినియోగాన్ని గతంలో మాదిరిగా కొనసాగించాలని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జుడీషియల్ స్టాంపులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్న విషయాన్ని విస్మరించింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా గుంటూరులో నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. ప్రజలు రూ.10, 20, 50, 100 స్టాంప్‌లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే అవి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆయా స్టాంపులను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో వెండర్లకు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. రెండు నెలల క్రితమే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చినప్పటికీ వాటిని ఆయా వెండర్లకు పంపిణీ చేయకపోవడం గమనార్హం. ఇదంతా ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనాల కోసమే అన్న ఆరోపణలు వస్తున్నాయి. నాన్ జుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే ప్రజలు ఈ-స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఇదే కారణమని వెండర్లు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈ-స్టాంపింగ్ వినియోగించుకుందాం అనుకున్నా సర్వర్ సమస్యల కారణంగా అవి కూడా సరిగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్సైజ్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్ శర్మ ఆకస్మికంగా తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

చేశారు. జిల్లా పరిధిలో వైన్ షాపులు, బార్ల పరిస్థితి గురించి వాకబు చేశారు. దుకాణాల పని వేళల పాటింపు, మద్యం అమ్మకాలు, నమోదైన కేసుల గురించి తెలుసుకున్నారు. చిలకలూరిపేట స్టేషన్ పరిధిలో రెవెన్యూ, వివిధ రకాల ఎక్సైజ్ నేరాల గురించి సమీక్షించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వినయ్‌కుమార్‌కు పలు విషయాలపై సూచనలు చేశారు. స్టేషన్ కానిస్టేబుళ్ళతో మాట్లాడి వారి రోజువారీ విధుల గురించి తెలుసుకుని, మెరుగైన పనితీరు గురించి తగు సూచనలు చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే రవీంద్ర పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,41,802 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,443 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,41,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,917 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13300	సింజెంటా		
273	--	--	బ్యాడిగి 5531	--	--
341	10500	13900	దేవనూరు డీలక్స్	10300	13200
4884	10000	11800	ఆర్మూరు	9800	11000
సూపర్ 10	--	--	తాలుకాయలు	4500	6400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10200	13500			

రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించాలి

● వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి

తాడికొండ(లాంఫాం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతులు సమష్టిగా పాటించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు రక్షణ వేదిక వారు ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు, ఎలా అనే అంశంపై చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రైతులు మితిమీరి, విచక్షణా రహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల వల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. ఎగుమతులకు అనువుగా ఉన్న, అధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే పంటలు పండించాలని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గించాలని, రైతు స్థాయిలో విత్తనోత్పత్తి జరగాలని విత్తన సాధికారిత సంపాదించాలని తెలిపారు. కౌలు రైతులకు ప్రోత్సహకాలు ఉండాలని, బయోడైవర్సిటీ, కమ్యూనిటీ సీడ్ డెవలప్‌మెంట్, పాతతరం విత్తనాలను సంరక్షించుకోవాలని సూచించారు. సుస్థిర వినియోగం, సంప్రదాయ వ్యవసాయ విధానాలు, కమ్యూనిటీ సీడ్స్ బ్యాంకులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం, ఎందుకు, ఎలా అనే అంశంపై డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రైతు రక్షణ వేదిక సభ్యులు కొల్లా రాజమోహన్‌రావు, హైదరాబాద్‌కు చెందిన డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ నేషనల్ ప్రొఫెసర్ డీ నరసింహరెడ్డి, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ బీవీ రామాంజనేయులు, బీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


రైతు ప్రత్యామ్నాయ వ్యవసాయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి తదితరులు

నేడు వెలగపూడిలో సీఎం ఇంటికి భూమి పూజ

ఉదయం 8.50 గంటలకు ముహూర్తం

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రెవెన్యూలో ఈ- 6 రోడ్డు వెంట ఉన్న ఐదెకరాల స్థలంలో నిర్మించుకునే ఇంటికి సీఎం చంద్రబాబునాయుడు బుధవారం భూమి పూజ చేయనున్నారు. కుటుంబ సమేతంగా ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఉదయం 8.50 గంటలకు ముహూర్త సమయంగా పండితులు నిర్ణయించారు. దీంతో సీఎం చంద్రబాబునాయుడు ఆ సమయంలో భూమి పూజ చేయనున్నారు. ప్రైవేటు కార్యక్రమం కనుక రాజధాని రైతులతో సహా ఎవరికీ ఆహ్వానం లేదు. అయితే వెలగపూడి గ్రామస్థులు పట్టు వస్త్రాలు పెట్టాలని సిద్ధమవడంతో పోలీసులు అనుమతి లేదని చెప్పారు. కుటుంబసభ్యులతో చేసుకునే ఈ కార్యక్రమానికి ఆటంకం కలిగించవద్దని మంగళవారం పోలీసులు వెలగపూడి గ్రామంలో తిరిగి ప్రజలకు సూచించారు.

పోలవరం- బనకచర్లతో చంద్రబాబు భగీరథ ప్రయత్నం

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం, బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారని, కరువురహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ఇది తొలి అడుగని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జలహారతి కార్పొరేషన్‌తో దశాబ్దాల దాహార్తిని తీర్చే ప్రగతి యజ్ఞానికి ముఖ్యమంత్రి నాంది పలికారన్నారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు కోసం కంపెనీ చట్టం కింద వందశాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్నారన్నారు. పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమ ప్రాంతాల్లో తరతరాలుగా పీడిస్తున్న కరువును తీర్చే బృహత్తర ప్రాజెక్టుగా పోలవరం - బనకచర్ల అనుసంధానం రూపు దిద్దుకుంటుందన్నారు. అలాంటి గొప్ప లక్ష్య సాధనకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు పల్నాడు ప్రజలు తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పోలవరం- బనకచర్ల లింక్‌లో భాగంగా బొల్లాపల్లి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపడతారని దాని ద్వారా తమ ప్రాంత ప్రజలకు తాగునీరు సాగు నీరుతో సమస్య తీరటంతోపాటు, భూగర్భ జలాలు కూడా భారీగా పెరుగుతాయని హర్షం వ్యక్తం చేశారు. అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల జలాలతో రెండు పంటలు పండించుకుంటూ పల్నాడు ప్రాంతం సస్యశ్యామలం కానుందని, బీడు భూములు పచ్చటితోరణంలా మార నుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందడంతో పల్నాడు ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.80వేల కోట్ల రూపాయలతో చేపట్టబోయే పోలవరం-బనకచర్ల భారీ ప్రాజెక్టు పూర్తయితే కరువు ప్రాంతాలైన పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమలకు నీటి సమస్య శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాజెక్టుల రూపంలో రాష్ట్ర ప్రలజ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్య మంత్రి చొరవకు పల్నాడు ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త మరణం



మృతిచెందిన ఆశీర్వాదం, సామ్రాజ్యం (ఫైల్)

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 8: భార్య మరణం తట్టుకోలేక మనోవేదనకు గురై గుండె పోటుతో భర్త మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గత కొంత కాలంగా పట్టణంలోని నిడుబ్రోలులో అన్నవరపు ఆశీర్వాదం(85), అన్నవరపు సామ్రాజ్యం(76) దంపతులు నివసిస్తున్నారు. ఆశీర్వాదం ఆర్మీలో పని చేసి పదవీ విరమణ చేశారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా ఇద్దరు కుమారులు గతంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆశీర్వాదం, సామ్రాజ్యం దంపతులు అనారోగ్యం బారిన పడ్డారు. సామ్రాజ్యం పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది. భార్య మరణంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం తెల్లవారుజామున ఆశీర్వాదం కూడా గుండెపోటుతో మరణించాడు. దంపతుల మృతి వార్త తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మృతుల బంధువులను ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ నాయకులు జాగర్లమూడి సుధీర్, పొన్నగంటి వాసు, ఆరే ప్రసాద్, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, సీతారామయ్య, వెంకటేశ్వరరావు, అహ్మద్‌ఖాన్ తదితర టీడీపీ నాయకులు దంపతుల మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07325 హుబ్లీ - కతిహార్ ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతీ బుధ వారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు మీదగా గురువారం వేకువజామున 3.20కి గుంటూరు, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కతిహార్ చేరుకుంటుంది. నంబరు. 07326 కతిహార్ - హుబ్లీ రైలు ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతీ శనివారం మధ్యాహ్నం మధ్యాహ్నం 2.15కి బయలుదేరి ఆదివారం రాత్రి 9.10కి గుంటూరు, సోమవారం ఉదయం 10.50కి హుబ్లీ చేరుకుంటుందని శ్రీధర్ తెలిపారు.

డెలివరీ బాయ్స్ వివరాలను.. ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్ తమ వివరాలను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని 18-59 మధ్య వయస్సు కల్గిన వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ సభ్యత్వం పూర్తిగా ఉచితమన్నారు. వివరాలకు 94925 55164 నెంబరును సంప్రదించాలన్నారు.

టూరిజం మార్కెటింగ్,కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నాదెండ్ల ఎంపీడీవో ఎస్ పద్మారాణి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై ఆమె అక్కడ పనిచేయనున్నారు. పద్మారాణిని జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు విధుల నుంచి రిలీవ్ చేశారు.

జనరేటర్ తగిలి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి), ప్రమాదవశాత్తు జనరేటర్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని అల్లం సెంటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు. పట్టణంలోని శివ సంజీవ కాలనీకి చెందిన వై రామకోటేశ్వరరావు (46) మోటార్ సైకిల్‌పై ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతున్నాడు. బస్టాండ్ వైపు నుంచి టాటా ఏస్ వాహనానికి జనరేటర్ తగిలించుకొని వస్తున్నారు. టాటా ఏస్ వాహనం నుంచి జనరేటర్ ఊడి ఎదురుగా వస్తున్న రామకోటేశ్వరరావుకు తగిలింది. తలకు తీవ్ర గాయం అవ్వడంతో రామ కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ



ఎన్టీఆర్ స్టేడియంలో పరిశీలన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఎన్టీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, శ్యామలనగర్ మెయిన్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో ఓపెన్ జిమ్, పచ్చదనం పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, డీఈఈ మధుసూదన్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. చుట్టగుంట దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని మంగళవారం పరిశీలించారు.

ఐదు శాతం రాయితీని వినియోగించుకోవాలి

ఈ నెలాఖరులోపు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు అర్థ సంవత్సరాల మొత్తం ఆస్తి పన్నును ఏకమొత్తంగా చెల్లించే వారికి పన్నుపై 5 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని నగర ప్రజలకు అవగాహన కలిగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐలు, ఆర్ఓలతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సెక్రటరీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ దరఖాస్తులు మంజూరు చేయాలి

భవన నిర్మాణ దరఖాస్తులను పరిశీలించి నిర్దేశిత సమయంలోపు అనుమతులు మంజూరు చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార నిర్మాణాలను గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నోటీసులు అందజేసి వాటిని తొలగించాలన్నారు. అనధికార డిస్‌ప్లే బోర్డులను గుర్తిస్తే బోర్డు ఏర్పాటు చేసిన ఏజెన్సీ వారి చేత తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు వెంకటేశ్వరరావు, రెహమాన్, టీపీఎస్‌లు, టీపీబీఓలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరగాలి

● జేఏసీ నాయకులు ఎల్ఎస్ భారవి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరగాలని బెటర్ శంకర విలాస్ ఫ్లైఓవర్ సాధన జేఏసీ నాయకులు ఎల్ఎస్ భారవి అన్నారు. స్థానిక బ్రాడీపేట శంకర విలాస్ కూడలి వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వం కట్టబోయే ఆర్ఓబీ ద్వారా వచ్చే ఇబ్బందులపై ప్రజలను చైతన్యపరిచే గోడ ప్రతులను మంగళవారం ఆవిష్కరించారు అనంతరం భారవి మాట్లాడుతూ ఆర్‌యూబీ నిర్మించకుండా ఆర్ఓబి నిర్మించటం చారిత్రక తప్పిదం మాత్రమేగాకుండా ప్రజలను తీవ్ర ఇక్కట్ల పాలు చేస్తుందని హెచ్చరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రయోజనకరమైన శంకర్ విలాస్ ఆర్వోబీ బ్రిడ్జి నిర్మించాలనే డిమాండ్‌తో అధికార రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈనెల 10న లాడ్జి సెంటర్ నుంచి హిందూ కళాశాల వరకు పెద్ద ఎత్తున మానవహారంతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరి సదాశివరావు, జి.వెంకట్రావు, రాజేశ్వరరావు, కమలకాంత్, సాంబశివరావు, మస్తాన్‌వలి, కళ్యాణి, వివిధ పౌర సంఘాల, స్వచ్ఛంద సంస్థల నాయకులు పాల్గొన్నారు.

ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● జిల్లా ఖజానా అధికారికి విజ్ఞాపన



చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల బిల్లులపైన సిటిజన్ చార్ట్ అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్, ట్రెజరీ కార్యాలయంలో జిల్లా ఖజానా అధికారి ఎం.చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ మార్చి 2025 కన్వీయేన్స్ ఎలివెన్సులను ఖజానా శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శివారెడ్డి, విజయబాబు, లక్ష్మీనారాయణ, పెదరత్తయ్య, శ్రీనివాస్, శరత్ కుమార్, చక్రవర్తి, సుమిత్రా దేవి, లలితమ్మ, రోజా, పి.కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల కల్పనకు కృషి

● సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ఆసుపత్రి అభివృద్ధికి సెంట్రల్ జీఎస్టీ శాఖ అండగా నిలుస్తుందని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి హామి ఇచ్చారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల కల్పనకు తమ శాఖ సహకారమందిస్తుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో పేషంట్లు కూర్చునేందుకు పద్దెనిమిది కుర్చీలను సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టీసీహెచ్ కోటేశ్వరరావుకు కమిషనర్ అందచేసారు. అనంతరం ఆసుపత్రిలోని విభాగాలను కమిషనర్ పరిశీలించి, ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అపరిష్కృతంగా వున్న కొన్ని సమస్యలను రోగులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళారు. వీటి పరిష్కారానికి తమ శాఖ కృషి చేస్తుందని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బిలక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు బీ రవికుమార్, ఎం నాగరాజు. సూపరింటెండెంట్లు చీదెళ్ళ ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, పూర్ణ సాయి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సత్వరమే చర్యలు

● జిల్లా ఖజానా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి



జేసీని కలిసిన జిల్లా ఖజానా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు జీతాలు, ఇతర బిల్లుల చెల్లింపులకు సంబంధించిన సమస్యలను సత్వర మే పరిష్కరిస్తానని జిల్లా ఖజానా శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఖజానా శాఖ అధికారిగా మంగళవారం బాధ్యత కు స్వీకరించిన తర్వాత అయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు బిల్లుల చెల్లింపు కు సంబంధించిన ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ఖజానా శాఖ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు నూతన డీటీఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై దృష్టి సారించాలి

● ఎస్పీ సతీష్ కుమార్



రైల్‌కోచ్ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌ల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆయన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రౌడీషీటర్ల వివరాలు, వారి కార్యకలాపాల గురించి సమీక్షించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. అర్ధరాత్రి సమయాల్లో హోటళ్ళు, బడ్డీకొట్లు, చిల్లర దుకాణాలు తెరవకుండా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని, పాటించని వారిపై కేసులు నమోదు చేసి, తగిన కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని రైలు కోచ్ రెస్టారెంట్ పరిశీలించి, నిర్ణీత సమయం తర్వాత తెరిచి ఉంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. అదే విధంగా బ్రాడీపేట 4వ లైనులో అనవసరంగా రోడ్లపై సంచరిస్తున్న పలువురు యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మరోసారి అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు అన్నారు. స్థానిక లాలుపురం రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అధ్యక్షత వహించారు. జూపూడి రంగరాజు మాట్లాడుతూ మోదీ పాలనలో ట్రిబుల్ తలాక్ రద్దు, ఒకే దేశం ఒకే పన్ను, అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, వక్ఫ్ సవరణ బిల్లు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. నేరళ్ల మాధవరావు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో బీజేపీ గణనీయమైన మార్పు తీసుకువచ్చిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, యడ్లపాటి స్వరూపరాణి, చరక కుమార్ గౌడ్, మేరీ సరోజిని, షేక్ రఫీ, షేక్ సాంబశివరావు,రాజేష్ నాయుడు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూపూడి రంగరాజు, పాల్గొన్న శనక్కాయల ఉమాశంకర్ తదితరలు

నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం, వెంగళాయపాలెంలోని ఎస్టీ కాలనీలో పేదల ఇళ్లను కూల్చివేయడంతో నిరాశ్రయులైన పేదల్ని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు పరామర్శించి నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు సమాచారం లేకుండానే, పోలీసులు వెంటబెట్టుకొని వెళ్లి దౌర్జన్యంగా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. ఎమ్మెల్యే లేని సమయంలో ఇటువంటి చర్యలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. కార్పోరేషన్ అధికారులు నల్లపాడు చెరువును ఆక్రమించుకున్నవారిని వదిలేసి...పేదల జోలికి వెళ్లడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధవి, టీడీపీ నాయకులు అవినాష్, బ్రహ్మం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

● గుంటూరు సర్కిల్ ఎస్ఈ కేవీఎల్ఎన్‌మూర్తి

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు మానసిక, శారీరక ధృడత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని గుంటూరు సర్కిల్ ఆపరేషన్‌ఎస్ఈ కేవీఎల్ఎన్‌మూర్తి తెలిపారు. ఇటీవల సంగడిగుంట విద్యుత్ భవన్ ఆవరణలో జరిగిన విద్యుత్‌శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. ఎస్ఈ మాట్లాడుతూ క్రీడలను కూడా రోజు వారీ వ్యాయామంలో భాగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, ఏడీఈ రాజేష్‌ఖన్నా, ఏవో కృష్ణారెడ్డి, ఖాన్, కోటేశ్వరరావు, కాంట్రాక్టు ఉద్యోగులు కె పాండురంగారావు, కె సాంబశివరావు, సురేష్‌బాబు తదితరులున్నారు.

బాలానంద కేంద్రం ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సాధారణ విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి బాలానంద కేంద్రం కృషి చేస్తున్నట్టు కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక పాత గుంటూరు, బాలాజీనగర్ బాలానంద కేంద్రం పాఠశాల వార్షికోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సంఘ సేవకురాలు గోవిందరాజు సంధ్యశ్రీ మాట్లాడుతూ బాలానంద కేంద్రానికి తమ తల్లిదండ్రులు రెండు వేల గజాల స్థలాన్ని అందించారని గుర్తు చేశారు. అనంతరం బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బాల కేంద్రం కార్యదర్శి నడింపల్లి గురుదత్, సభ్యులు ఇంజనీర్ కేఎస్ఆర్ కుటుంబరావు, కేతరాజు రామ్ సుభాష్, కట్టమూరి నాగరాజరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, పీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ ఏ.అమృతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : సీపీఐ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపును వ్యతిరేఖిస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్ నుంచి భగత్ సింగ్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వం అనేకమార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని విమర్శించారు. నిరసనల్లో సురేష్ బాబు, చల్లా మరియదాస్, యశ్వంత్, నూతలపాటి వెంకటేశ్వరరావు, వలి, జంగాల చైతన్య, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జయంతికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

● ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీలాకు విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 11న జరిగే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీలా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఫ్రంట్ సభ్యులు మాట్లాడుతూ స్థానిక హిందూ కాలేజి సెంటర్లోని పూలే విగ్రహం పక్కనే సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు, లింగాల వెంకటసాయి, సాదు మాల్యాద్రి, మానేపల్లి దుర్గారావు, బత్తుల వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు, గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం. అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం, ఆల్ రౌండర్ రాము ఈవెంట్స్, తణుకు వారిచే ఇంద్రజాల ప్రదర్శన, మిమిక్రీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారత వరల్డ్ రికార్డెడ్, నంది అవార్డు గ్రహీత ప్రసన్న ఇంద్రజాల ప్రదర్శన చిన్నారులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

పాత గుంటూరు ఘటనలో.. పోలీసుల నిర్లక్ష్యం

● నివేదిక సిద్ధం.. సీఐ, ఎస్ఐలపై చర్యలకు సిఫార్సు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనందపేటలో ఇటీవల కర్రలతో కొట్టి వృద్ధురాలిని హత్య చేసిన ఘటనకు సంబంధించి చోటు చేసుకున్న పరిణామాలు పోలీసుల వైఫల్యంగానే ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. ఆ ఘటనలో అడుగడుగునా పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా ఉన్నట్లు తేలింది. ఇరువర్గాలు దాడులు, ప్రతి దాడులతో సుమారు రెండు, మూడు గంటలకు పైగా యథేచ్ఛగా కర్రలు, మారణాయుధాలతో తిరిగినా పోలీసులు పట్టించుకోలేదని గుర్తించారు. నిందితులు ఫిరోజ్, ఫయాజ్‌లతోపాటు రౌడీషీటర్లైన ఆసిఫ్, నస్రీలు జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న బాలిక తండ్రిపై కూడా దాడికి పాల్పడడం కలకలం రేపింది. ఈ ఘటనపై తొలుత డయల్ 100కు సమాచారం ఇవ్వగా పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ నుంచి ఏఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లారు. గొడవ పడుతున్న వారిలో కొందరిని స్టేషన్‌కు తీసుకువచ్చి ఆ తర్వాత వదిలివేయడంతో వారు మళ్లీ వెళ్లి దాడికి తెగబడ్డారు. మూడు నాలుగు దఫాలు దాడులు, ప్రతి దాడులు జరుగుతున్నా కూడా పోలీసులు స్పందించకపోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈ ఘటనలో పాల్గొన్న రౌడీషీటర్ సుమారు రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్లో కౌన్సిలింగ్‌కు హాజరుకాకపోయినా పట్టించుకోకపోవడం, పోలీసు అధికారులను విస్మయానికి గురిచేసింది. రౌడీషీటర్ల కదలికలపై నిఘా లేకపోవడాన్ని కూడా సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత కూడా ఎస్ఐ, సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక తయారు చేసిన పోలీస్ అధికారులు ఐజీకి పంపినట్లు తెలిసింది. ఈ నివేదిక ఆధారంగా ఎస్ఐ రెహమాన్, సీఐ సోమయ్యలపై చర్యలు తీసుకోనున్నారు. నేడు రేపో వారిపై వేటుపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలు వీడండి

● హిజ్రాలకు మహిళా స్టేషన్ డీఎస్పీ కౌన్సెలింగ్

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : హిజ్రాలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు హెచ్చరించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్‌లో నగరంలోని పలువురు హిజ్రాలతో సమావేశం నిర్వహించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నగరంలోని ట్రాఫిక్ జంక్షన్లు, వ్యాపార సముదాయాలు వద్ద సంచరిస్తూ వాహనదారులు, దుకాణాదారులు, ప్రజల వద్ద నుండి బలవంతంగా నగదు వసూలు చేస్తున్నారని, ఇవ్వని వారిని పరుష పదజాలంతో దూషిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై ఈ సమావేశం నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారు వారికి కల్పించిన సదుపాయాలను ఉపయోగించుకుని సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని జీవించాలన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నపేటకు చెందిన ఎలిజాల శిరీష (25) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శిరీషకు ఐదు సంవత్సరాల క్రితం సైదులుతో వివాహం జరిగింది. వారికి ఒక పాప, బాబు సంతానం ఉన్నారు. శిరీష భర్త సైదులు బార్‌లో సప్లయర్‌గా పని చేస్తున్నాడు. శిరీష కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేక బాధపడుతోంది. ఈనెల 7న కొరిటెపాడులో అద్దెకు ఉంటున్న ఇంట్లోని చెక్క దూలానికి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని పెయింటర్...

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్‌కి చెందిన బద్దెపూడి చార్లెస్ (53) అనే పెయింటర్ ఆత్మహత్యకు చేసుకున్నాడు. మద్యానికి బానిస అయ్యి డబ్బుల కోసం భార్య, కుటుంబ సభ్యులను వేధిసున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1న మద్యానికి డబ్బులు కోసం గొడవ పెట్టుకోవడంతో భార్య, కూతురు బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. కొన్ని రోజుల నుంచి వారింటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు చూడగా చార్లెస్ సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. అతడి భార్య బద్దెపూడి కిరణ్ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నపేటకు చెందిన నెల్లూరి రామకోటమ్మ(66) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం ఆమె ఇంటిలోని బాత్రూంలో కాలుజారిపడ్డారు. తొంటి విరగడంతో జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా వృద్ధురాలి మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆప్కాస్ రద్దు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

● చైర్మన్ బి.లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని జేఏసీ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ చైర్మన్ బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆప్కాస్ రద్దుపై మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని జేఏసీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఆప్కాస్‌ని రద్దు చేస్తే ఉద్యోగ, కార్మికులకు మినిమం టైం స్కేలు అమలుపరిచి, రెగ్యులర్ చేయడమే సరైన మార్గమని సూచించారు. ఆప్కాస్ రద్దు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఈనెల 27న జిల్లా సదస్సు, మే 5న కలెక్టరేట్ వద్ద ధర్నా, మే 20న జాతీయ సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో శ్రీనివాసరావు, నాగునాయక్, సీహెచ్ గోపాలకృష్ణ, మరియదాసు, ప్రభుదాస్, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కోదండ రామ కల్యాణోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక స్తంభాలగరువు, శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శ్రీ సీతారామ కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం షడ్విష్టన హోమం, నారాయణోపనిషత్ పారాయణ పూర్ణాహుతిలు జరిగాయి. అనంతరం స్వామి వారికి వైభవంగా వసంత సేవ నిర్వహించారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంలో ప్రదర్శించిన గయోపాఖ్యానం నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని కోదండ రామ సేవ సమితి అధ్యక్షుడు పంచుమర్తి కోటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

పేదలకు కార్పొరేట్ వైద్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ధైర్యంగా వైద్యం చేయించుకునే పరిస్థితి రావడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఉందనే నమ్మకమే కారణమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురికి మంగళవారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.1.24 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించామని తెలిపారు. సీఎం చంద్రబాబు సహకారమే అందుకు కారణమని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భారతి, గోళ్ల ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, పోతురాజు చంద్ర, కిరణ్, మొహమ్మద్ హఫీజ్, సలీం, కోట పిచ్చిరెడ్డి, మల్లంపూడి శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, జమీర్, చిలక వెంకటేశ్వర్లు, జబీ, శైలజ, ఉమామహేశ్వరి, సలాం, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు

నియోజకవర్గంలోని శ్మశాన వాటికల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాత గుంటూరు, డీఎస్ నగర్‌లోని శ్మశాన వాటికలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలకు రోడ్లు, డ్రెయిన్స్ వేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. పేద కుటుంబాల్లో చనిపోయిన వారికి కార్యక్రమాలు చేసుకునేందుకు హాల్స్, సొంత ఇల్లు లేని భర్త చనిపోయిన మహిళలకు వసతి గృహాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఎక్కడ శవం దొరికితే అక్కడ జగన్ రెడ్డి గద్దలాగా మారి, ఊసరవెల్లిలాగా తన రంగును, మాటను మారుస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కూడా జగన్ రెడ్డి తీరులో ఎటువంటి మార్పు కనిపించటం లేదు, ఐదేళ్ల పాలనలో చేసిన అరాచకాలకు విసుగుచెందిన ప్రజలు ఆయనకు కనీసం ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే విషయం తెలిసినా వైసీపీ తన తీరును మార్చుకోవడం లేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలే హత్యలు, హత్యాచారాలు, లైంగిక వేధింపులకు పాల్పడితే నోరు మెదపని జగన్ రెడ్డి ప్రస్తుతం ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆమె ఆరోపించారు.

ఫ్యాక్షన్‌ను తట్టి లేపుతున్న వైసీపీ నేతలు : మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు వైసీపీ నాయకులు మళ్లీ తెర తీస్తున్నారని, అంతరించిపోతున్న ఫ్యాక్షన్ భూతాన్ని మరోసారి తట్టిలేపే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి డైరక్షన్‌లో జగన్ యాక్టింగ్ చేశాడని విమర్శించారు. జగన్ అనంతపురం పర్యటనలో పరామర్శ పేరుతో బలప్రదర్శన చేశాడని ఆరోపించారు. ఒక చావుని రాజకీయం చేసేందుకే మాత్రమే వచ్చారని విమర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారా? లేక కార్యకర్తల చేత జేజేలు కొట్టించుకునేందుకు వచ్చారా అంటూ జగన్‌ను మన్నవ నిలదీశారు. జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు

జగన్‌రెడ్డి నాటకాలను జనం నమ్మరు : కోవెలమూడి



కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : శవాలను అడ్డం పెట్టుకుని జగన్‌రెడ్డి ఆడుతున్న నాటకాలను నమ్మడానికి జనం ఎంతమాత్రం సిద్ధంగా లేరని టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత కూడా జగన్ తీరు మారకపోవడం ఆశ్చర్యంగా ఉంద న్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని అరాచకం చేసిన జగన్ ఇప్పుడు అదే వ్యవస్థలపై బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. జగన్ బెదిరింపు రాజకీయాలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారన్నారు.

శవాల కోసం ఎదురు చూసే రాబందు జగన్

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శవాల కోసం ఎదురు చూసే జగన్ లాంటి రాబందు రాజకీయాలకు పనికిరాడని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని మాట్లాడటం చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు స్వేచ్ఛగా ఉండటం జగన్‌కు ఇష్టం లేనట్టుందని అన్నారు. పాపిరెడ్డి పల్లెలో జరిగిన ఇరువర్గాల ఘర్షణను జగన్‌రెడ్డి ఫ్యాక్షన్, రాజకీయ గొడవగా చిత్రీకరించాలని ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. జగన్‌రెడ్డి పాలించిన 5 సంవత్సరాలలో రాష్ట్రంలో దళితులు, బీసీలు, మహిళలు, ఎవరైనా రోడ్డు మీద స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు ఉన్నాయా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఆయన పాలనలో నిత్యం అరాచకమే రాజ్యమేలిందన్నారు. జగన్‌ను నమ్మే వాళ్ళు రాష్ట్రంలో ఎవరూ లేరని అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయ స్థాయిలో అవార్డులతో పాటు, నగదు బహుమతులు లభించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ నోయిడాలో గల్గోటియాస్ యూనివర్సిటీలో ఐఎస్ఐఈ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన "ఎస్ఐఈపీ - ఈ బైక్ డిజైన్ ఛాలెంజ్ (సీజన్ 5.0)" జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు రూపొందించిన ఈ-బైక్ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ అవార్డు (రూ.30,000 నగదు బహుమతి), ఫ్యూచర్ అవార్డు (రూ.5,000 నగదు బహుమతి)లను గెలుచుకున్నారు. మెకానికల్ విభాగానికి చెందిన 25 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

మిస్సింగ్ సిటిజన్స్.. గుర్తింపు



- ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
- నాలుగు నెలల క్రితం మూడు జిల్లాల్లో 6.50 లక్షల అన్‌మ్యాపింగ్ ● ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్
- ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మ్యాపింగ్ జరగని పౌరులను గుర్తించి డేటా సేకరించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తిస్థాయిలో ఆచరణలోకి తీసుకొచ్చారు. కొంతమంది ఇక్కడి సచివాలయాల్లో ఏదో ఒక సర్వీసు పొంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. సంపన్నుల నివసించే ప్రాంతాల్లోని ప్రజలు సచివాలయాల్లో మ్యాపింగ్ కావడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. దీని వలన తమ గోప్యతకు భంగం వాటిల్లుతుందని చెబుతూ సర్వేకి వెళ్లిన సిబ్బందిని వెనక్కు పంపేస్తున్నారు. దీంతో మిస్సింగ్ సిటిజన్స్‌ని పట్టుకోవడం కష్టసాధ్యం కాగా వాళ్లని ఏదో ఒక విధంగా ఒప్పించి సమీపంలోని సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. దీంతో పెండింగ్ శాతం 96 నుంచి నేడు 1 శాతానికి తగ్గిపోయింది.

గుంటూరు జిల్లాలో 2 లక్షల 51 వేల 298 మంది పౌరుల యూనిక్ రికార్డులు కనిపించడం లేదు. అలానే పల్నాడు జిల్లాలో 2 లక్షల 2 వేల 328, బాపట్ల జిల్లాలో లక్ష 65 వేల 477 మంది డేటా అందుబాటులో లేదు. దాంతో ఎవరైతే మిస్సింగ్ సిటిజన్స్ ఉన్నారో వారి డేటాని ఇదివరకే సచివాలయాల లాగిన్‌లకు ప్రభుత్వం పంపించింది. ఆ డేటాని సంబంధిత సచివాలయాల కార్యదర్శులు తీసుకొని మిస్సింగ్ సిటిజన్స్ వద్దకు వెళ్లి వారి ఆధార్‌ల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన లింక్/యాప్‌లో నమోదు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. దీని ఫలితంగా ఇప్పటివరకు గుంటూరు జిల్లాలో 2,47,630 పల్నాడులో 2,01,004, బాపట్లలో 1,65,464 మంది మిస్సింగ్ సిటిజన్స్ గుర్తించి మ్యాపింగ్ చేశారు. దీంతో మ్యాపింగ్ ప్రక్రియ గుంటూరులో 1.46 శాతం, పల్నాడులో 0.65, బాపట్లలో 0.01 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నది.

సర్వేల పేరుతో తరచుగా వెళుతుండటంతో ప్రజలు అసహనం

కాగా సర్వేల పేరుతో గతంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లేవారు. ఇప్పుడు ఆ పాత్రని సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు పోషిస్తున్నారు. సర్వేకి వెళ్లిన ప్రతీసారి ఆధార్ నంబరు చెప్పమని కోరుతున్నారు. దాని ద్వారా వచ్చే ఓటీపీని చెప్పమంటుండటంతో తమ డేటా ఎక్కడ బయటకు లీకు అవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలానే పోష్ ఏరియాల్లో నివసిస్తున్న వారిలో ఎక్కువమందికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందవు. దాంతో తామెందుకు సచివాలయాల్లో మ్యాపింగ్ చేసుకోవాలని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అపార్టుమెంట్‌లు, గ్రూపు హౌసింగ్‌లలోకి తరచుగా సర్వేల పేరుతో వెళ్లి సిబ్బంది విసిగిస్తుండటం నివాసితులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల అయితే ఎంఎస్ఎంఈ, క్యాన్సర్ స్క్రీనింగ్, పీ4, వర్క్ ఫ్రం హోం వంటి 16 సర్వేలతో ప్రజల వద్దకు సిబ్బంది కొన్ని నెలల వ్యవధిలో వెళ్లారు. తరచుగా సర్వే పేరుతో వచ్చి ఏవేవో ప్రశ్నలు వేస్తూ విసిగిస్తుండటంతో తామెందుకు చెప్పాలని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ ఇందుకేనా తమని మ్యాపింగ్ చేసిందని ప్రశ్నిస్తున్నారు.



సేవలపై సంతృప్తి

ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా! ● పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి ● ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి పని తీరుపై ప్రజల్లో మరింత భరోసా పెరిగింది. ఆసుపత్రి పనితీరుపై సుమారు 75 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల కిందట నిర్వహించిన సర్వేలో 61 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఎస్ఆర్) నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. గతంలో జనవరి 27న, ఫిబ్రవరి 7న, మార్చి ఐదో తేదీన మూడు దఫాలుగా ఐవీఎస్ఆర్ ద్వారా ప్రభుత్వాస్పత్రి పని తీరును తెలుసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 7న జరిపిన సర్వేలో గత మూడు సర్వేల కంటే ప్రజల్లో ప్రభుత్వాస్పత్రుల పనితీరుపై సానుకూలత పెరగడం విశేషం. సర్వే వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రితో పాటు రాష్ట్రంలోని ఇతర వైద్య బోధన ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల పనితీరును సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు.

సర్వే వివరాలు

- ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని 74.14 శాతం మంది ప్రజలు తెలిపారు. గతంలో 66 శాతం మంది మాత్రమే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. తాజా సర్వేలో 12.33 శాతం మంది అధికంగా వైద్య సిబ్బంది పనితీరుపై సానుకూలత వ్యక్తం చేశారు.
- ఆసుపత్రిలో డాక్టర్లు రాసిన మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించగా, 67.63 శాతం మంది ఇస్తున్నారని తెలిపారు. గతంలో 57 శాతం మంది మాత్రమే మందులు ఇస్తున్నాని తెలిపారు.
- ప్రభుత్వాస్పత్రిలో అవినీతి ఉందా? అని ప్రశ్నించగా, 41.17 శాతం మంది ఉన్నట్లు చెప్పారు. జనవరిలో నిర్వహించిన సర్వేలో 63 శాతం మంది ఆసుపత్రిలో అవినీతి ఉందని స్పష్టం చేశారు.
- ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్యంపై మాత్రం ప్రజలు పెదవి విరిచారు. గత సర్వేల్లో 60 శాతం మంది పారిశుద్ధ్యం బాగానే ఉందని చెప్పగా, తాజాగా నిర్వహించిన సర్వేలో కేవలం 49 శాతం మంది మాత్రమే పారిశుద్ధ్యంపై సంతృప్తి ప్రకటించారు.
- ఇక జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రుల పనితీరుపై కూడా సానుకూలత వ్యక్తమైంది. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని 74 శాతం మంది తెలిపారు. గతంలో కేవలం 47శాతం మంది ప్రజలు మాత్రమే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు.
- ఆసుపత్రుల్లో అవినీతి తగ్గిందన్న వారి సంఖ్య 41 శాతం నుంచి 61 శాతానికి పెరిగింది. డాక్టర్ రాస్తున్న మందులు ఇస్తున్నారని చెప్పిన వారి సంఖ్య 59 నుంచి 79 శాతానికి పెరిగింది.
- జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం బాగా ఉందని చెప్పిన వారు కేవలం 50 శాతం మంది మాత్రమే. గతంలో 67 శాతం మంది శానిటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేయగా, అది తాజా సర్వేలో 17 శాతం తగ్గిపోయింది.

'మన మోడల్' పాఠశాలగా మార్చుకుందాం

- చినకోండ్రుపాడులో గ్రామ పెద్దల వినూత్న కార్యక్రమం
- 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్
- పాఠశాల దత్తతకు ముందుకు వచ్చిన పద్మజారాణి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని నిలబెట్టుకునేందుకు గ్రామస్థులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి చదువుకొనే పరిస్థితుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో కునారిల్లుతున్న చినకోండ్రుపాడు మెయిన్ పాఠశాలకు ప్రాణం పోసేందుకు ఆ గ్రామానికి చెందిన పద్మజారాణి ముందుకు వచ్చారు. ఆమెకు చినకోండ్రుపాడులోని టీడీపీ నాయకులు ఊతం ఇవ్వడంతో కొద్ది రోజుల్లోనే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అత్యంత ఆదరణ పెరిగింది. నెల రోజుల వ్యవధిలోనే వివిధ పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ బడికి తమ పిల్లలను పంపుతాం అంటూ విల్లింగ్ లెటర్స్ తీసుకుని విద్యాశాఖ అధికారులకు అందించారు.

గతంలో చినకోండ్రుపాడు మెయిన్ పాఠశాల ఎక్కువ మంది విద్యార్థులతో మోడల్ స్కూల్‌గానే ఉండేది. అయితే గత వైసీపీ హయాంలో 117 జీవో పుణ్యమా అంటూ 3, 4, 5 తరగతులు పక్కనే ఉన్న హైస్కూల్లో కలిసాయి. ఆ తరువాత నుంచి ఈ పాఠశాలలో ముగ్గురు, నలుగురు విద్యార్థులు మాత్రమే ఉంటూ వస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో అసలు పిల్లలు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఈ పాఠశాలను ఈ ప్రభుత్వం పూర్తిగా బేసిక్ మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చింది. ఈ క్రమంలో గ్రామ పెద్దలు మోడల్ స్కూల్‌గా మార్చాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేయడం.. అరవై మంది విద్యార్థులు ఉంటే గాని మార్చడానికి వీలు పడదని చెప్పడంతో వారిలో ఆలోచన మొదలైంది. వెంటనే గ్రామానికి చెందిన పద్మజారాణితో పాటు, చినకోండ్రుపాడుకి టీడీపీ నాయకుడు సుబ్బారావు, జడ్పీ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణలు గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో చదువుకునే విద్యార్థుల జాబితాను తయారు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకోవడం మొదలుపెట్టారు. ఇందుకోసం కొన్ని రోజులుగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా తమ పిల్లలకు విద్యాబుద్ధులు అందించే బాధ్యతను వీరు తీసుకున్నారు. అందరికృషితో ఇప్పటి వరకు వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్ తీసుకుని మండల విద్యాశాఖ అధికారులకు అందించారు. రానున్న విద్యాసంవత్సరంలో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడితో పాఠశాల పూర్వ వైభవం సంతరించుకోనుంది.



గ్రామంలో పెద్దలతో కలిసి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పద్మజారాణి

పాఠశాల దత్తత కోసం అర్జీ పెట్టాను : పద్మజారాణి

ముఖ్యమంత్రి ఇచ్చిన పీ-4 పిలుపుతో పాఠశాలను దత్తత తీసుకునేందుకు ప్రభుత్వానికి అర్జీ పెట్టానని పద్మజారాణి తెలిపారు. సంవత్సర కాలంగా ముగ్గురు టీచర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్లు చెప్పిస్తున్నామన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను బతికించేందుకు తనవంతు చేయూత అందిస్తానన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు వాహన సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తానని ఆమె తెలిపారు.

నటుడు.. నిర్మాత.. దర్శకుడు.. రచయిత.. బాలయ్య

- సినీ రంగంపై చెరగని ముద్ర
- ఆయన జీవితం గుంటూరుకే గర్వకారణం
- నేడు బాలయ్య జయంతి.... వర్ధంతి



గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాత తరం సినీ నటుడు మన్నవ బాలయ్య 1930 ఏప్రిల్ 9న అమరావతి మండలంలోని చావపాడు గ్రామంలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం తెనాలి, మద్రాసు (ప్రస్తుతం చెన్నై)లో జరిగింది. చిన్ననాటి నుండి నాటకాలపై, నటనపై తీవ్రమైన ఆసక్తి కలిగి ఉండేవారు.

సినీ ప్రయాణం....

బాలయ్య 1953లో ఎత్తుకు పై ఎత్తు అనే చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఆయన సహాయ నటుడిగా, ప్రతినాయకునిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగుతో పాటు తమిళ చిత్రాలలోనూ నటించారు. అత్యంత విలక్షణమైన నటనతో ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన 300లకు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. 1950 నుంచి 1990 వరకు తన నటనతో ఎన్నో అద్భుతమైన చిత్రాలలో నటించి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు.

ప్రముఖ చిత్రాలు......

ఆయన నటించిన ప్రముఖ చిత్రం మాయాబజార్. ఈ చిత్రంలో ఆయన చేసిన సహనటుడి పాత్ర ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. లవకుశ, దేవత (ఓల్డ్), గుండమ్మ కథ, భక్త ప్రహ్లాదా, మరో చరిత్ర వంటి సినిమాలలో కూడా ఆయన మంచి పాత్రలు పోషించారు.. కేవలం పాతకాలపు చిత్రాలు కాకుండా, 1970, 1980 ల లోనూ మంచి పాత్రలు చేశారు.

నిర్మాతగా కూడా..

బాలయ్య అమృత ఫిలిమ్స్ పేరిట కొన్ని సినిమాలు కూడ నిర్మించారు. ఆయన నిర్మించిన సినిమాలలో నేరము- శిక్ష అత్యంత ప్రజాదరణ పొందింది.

పురస్కారాలు....

ఆయన నటనకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఎన్నో అవార్డులు అందుకున్నారు. నంది అవార్డు పురస్కారం కూడా ఆయనకు లభించింది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు అనేక అవార్డులు, సన్మానాలు లభించాయి.

మరణం

బాలయ్య 2022 ఏప్రిల్ 9న 92 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద లోటని చెప్పవచ్చు. ఆయన పుట్టిన తేదీ, మరణించినది ఏప్రిల్ 9నే కావడం విశేషం. బాలయ్య సినీ జీవితం నేటితరం నటులకు స్ఫూర్తిదాయకం.

సమ్మె బాటలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

● డీఎంహెచ్‌కు నోటీసు అందజేత

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో)లు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని కలిసి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారిని క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన మీదటే తాము ఈ ఉద్యోగాల్లో చేరామని తెలిపారు. అయితే ఆ విషయం గురించి అడుగుతుంటే అధికారులు సరిగా పట్టించుకోవటం లేదని, జీతాల పెంపు విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వివిధ స్థాయిల్లోని అధికారులకు నోటీసులు అందజేసి ఆ తర్వాత సమ్మె చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిపివేయడం ద్వారా నిరసన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. డీఎంహెచ్‌వోకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పల్లపాటి లింగరాజు, కే సృజన, దీక్షిత, అబ్బుస్ తదితరులు ఉన్నారు.


డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

ఎంఈవోల వసూళ్ల దందా

విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు ఎంఈవోలకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు వేరు..... ఒకరు పరిపాలనా పరమైన అంశాలకు పరిమితం కావాలని, మరొకరు ప్రభుత్వ పాఠశాలల పనితీరు నిత్యం పర్యవేక్షించి పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలని, నిబంధనలు ఉల్లగించకుండా ప్రైవేటు పాఠశాలల్ని కట్టడి చేయాలనే విధులు ప్రధానమైనవి. అయితే ఈ విధుల్ని విస్మరించి ఇద్దరు ఎంఈవోలు ప్రైవేటు పాఠశాలల నుంచి, భారీ మొత్తాలు వసూళ్ళు చేయడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్ని ఆర్థిక ప్రయోజనాలకు వాడుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదీ గుంటూరు డివిజన్‌లో కీలక నియోజవర్గంలో పనిచేసే ఇద్దరు ఎంఈవోలు చేస్తున్న వసూళ్ళదందా.

ప్రైవేటు పాఠశాలలకు టార్గెట్

నగరంలోని చిన్నా, పెద్ద ప్రైవేటు పాఠశాలలు దాదాపు 150పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్ని ఆకస్మిక తనిఖీ చేయడం అక్కడ నిబంధనలు సరిగా పాటించడం లేదని, పారిశుధ్యం, తాగునీరు, ఉపాధ్యాయులకు సరైన అర్హత లేవనే కారణాలు చూపి భారీ మొత్తంలో ఇద్దరు ఎంఈవోలు దండుకుంటున్నారు. వాస్తవంగా ఇందులో ఒక ఎంఈవో పరిపాలనకే పరిమితం కావాల్సి ఉండగా లేని అధికారాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- ఇటీవల గుంటూరు రూరల్ మండల పరిధిలోని ఓ పాఠశాలకు తనిఖీ కోసం వెళ్ళి చిన్న చిన్న కారణాలు చూపి రూ. 15వేలు ఫైన్ వేశారు. దీంతో సదరు పాఠశాల యాజమాని లబోదిబోమంటూ విద్యాశాఖలోని అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు.
- నగర పరిధిలోని మరోస్కూల్‌కు తనిఖీలకు వెళ్ళి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోలు తమ వద్ద పనిచేసే సీఆర్‌పీలను వసూళ్ళ కోసం వాడుకుంటున్నారు. ప్రతిరోజు సీఆర్‌పీలకు టార్గెట్లు పెట్టి ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల నుంచి రూ. 10వేల నుంచి రూ. 20 వేల వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి వసూళ్ళు చేస్తున్నారు.
- నగర పరిధిలోని జడ్పీ, మున్సిపల్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ తదితర సర్వీసులకు సంబంధించిన ఫైల్స్ క్లియర్ చేయాలన్నా భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు.
- నగర పరిధిలోని ఎయిడెడ్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్స్ విషయంలోనూ వసూళ్లు ఆపడం లేదు. ఓ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి సంబంధించి పెన్షన్ రికార్డుల కోసం దాదాపు రెండు నెలల నుంచి సంబంధిత కుటుంబ సభ్యులు ఎంఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోల్లో ఒకరు పాఠశాల హెచ్‌ఎంగా రెగ్యు లర్‌గా పనిచేస్తూ ఎంఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాల హెచ్‌ఎం బాధ్యతల్ని ఇతరులకు అప్పగించి ఆయన వసూళ్ళకే పరిమితం అవుతున్నారని, కనీసం పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌కూడా పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్.....

తన నియోజక వర్గంలో పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తికి ఎంఈవో బాధ్యతల నుంచి తప్పించాలని నగర పరిధిలోని ఓ ఎమ్మెల్యే విద్యాశాఖకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన లేఖను విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎంఈవోగా కొనసాగడానికే సదరు హెచ్‌ఎం ఆసక్తి చూపుతున్నాడని, ఇందుకోసం ఉన్నత స్థాయిలో పైరవీలు సాగిస్తున్నట్లు విద్యాశాఖలో ప్రచారం సాగుతోంది.

బస్టాండ్‌లో ధరల దోపిడీ

- గుంటూరు డిపోలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు
- దుకాణాల వద్ద కనిపించని ధరల పట్టికలు
- తాగునీటినీ ప్రయాణికులు కొనుగోలు చేయాల్సిందే...

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు దోపిడీకి గురవుతు న్నారు. కొన్ని తినుబండారాల స్టాల్స్‌లో ఎమ్మా ర్పీను ఉల్లంఘిస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటీవల ఆర్టీసీకి చెందిన ఓ యూని యన్ నాయకుడే ధరల దోపిడీకి గురై అధికా రులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ దుకాణదా రుడుకి అధికారు జరిమానా విధించారు. అధికా రులు ఉదాశీన వైఖరి కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి బస్టాండ్‌లో స్టాల్స్ యజమాను లకు అనువుగా మారిందన్న విమర్శలు వినిపి స్తున్నాయి. వాస్తవానికి ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో స్టాల్స్‌లో ధరలు పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. టెండర్‌లో పేర్కొన్న వస్తువులను మా త్రమే సదరు స్టాల్స్‌లో విక్రయించాల్సి ఉంటుం ది. అయినప్పటికీ అటువంటి నిబంధనలు ఏమి అక్కడ అమలు కావటం లేదు. కొన్ని వస్తువు లకు అనుమతులు తీసుకుని అదనపు వస్తువు లను సైతం విక్రయిస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. కొందరు స్టాల్స్ యాజమానులతో అధికారులు కుమ్మక్కై పట్టీపట్టనట్లు వ్యవహ రిస్తున్నారన్న ఫిర్యాదులూ లేకపోలేదు. రూ. 25ల కూల్ డ్రింక్స్ బాటిల్‌ను రూ. 30లు వసూ లు చేస్తున్నారు. ఇక వాటర్ బాటిల్స్‌లోనూ అంతే అదనంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఫిర్యాదు లు వెల్లువెత్తుతున్నాయి. ఇక బస్టాండ్‌లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం.. ఎండలు మండుతుండటంతో తాగునీరు కూడా వేడిగా ఉండటంతో ప్రజలు చేసేది లేక స్టాల్స్‌లో వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు. నాసిరకం కంపెనీల వాటర్ బాటిల్స్ పెట్టి ధరలు మాత్రం బ్రాండెడ్ వాటర్ బాటిల్స్ ధరలనే వసూలు చేస్తున్నారు. బస్టాండ్‌లో గతంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు మూలన పడటంతో పట్టించుకునే నాథుడే లేడు.

కనిపించని తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు

బస్టాండ్‌లో గతంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తం చేసే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. తూనికలు, కొలతల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక బస్టాండ్‌లోనూ నిరం తరం పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనే జర్ (ఏటీఎమ్) ఇన్‌ఛార్జ్ డిప్యూటీ సీఎమ్‌వోగా వ్యవహరిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని ఓ స్టాల్

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 673 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,300, గరిష్ఠధర రూ.12,400, మోడల్‌ధర రూ.12,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,300 గరిష్ఠధర రూ.12,500, మోడల్‌ధర రూ.12,000 పలికాయి

సమస్యలపై నేడు ప్రజా దర్బార్

తుళ్లూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలపై తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు ప్రజల సమస్యలు, వాటి పరిష్కారంపై ఎమ్మెల్యే అర్జీలు స్వీకరిస్తారు. అనంతరం పార్టీ క్యాడర్‌తో గెట్ టు గెదర్‌లో ఎమ్మెల్యే పాల్గొంటారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

ఫిరంగిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్షణ ఇంజనీరు విజయకృష్ణ, ఆపరేషన్ విభాగం డీఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజనీరు పీ సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత తనిఖీలు జరిపారు. ఫిరంగిపురం, బేతపూడి, గొల్లపాలెం, కండ్రిక, మేరికపూడి, రేపూడి, పొనుగుపాడు, వేమవరం, వేములూరిపాడు గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ వెంకటేశ్వరరావు, డీపీఈ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏడుకొండలు తెలిపారు. ఈ తనిఖీల్లో 35 మంది అధికారులు, 130 మంది సిబ్బంది 35బృందాలుగా ఏర్పడి 2066 సర్వీసులు తనిఖీ చేశామన్నారు. మీటరు ఉన్నప్పటికీ అనధికారికంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న తొమ్మిది మందికి రూ.లక్షా 40వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 32 మందికి రూ.లక్షా 74వేలు అపరాధ రుసుం విధించామన్నారు. ఈ దాడుల్లో డీఈఈ ఎస్ఎం ప్రసాదు, డీఈఈ కే రవి కుమార్, డీఈఈ ఏ త్రినాథరావు, ఏఈలు చంద్రశేఖర్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, దుర్గా ప్రసాదు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి పెనుమాకలో జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు ఆర్ వేణు, రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని అమరావతి గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించకుండా సీఆర్‌డీఏ అధికారులు ఏజెన్సీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వేణు, రవి, గురవయ్య, రాయప్ప, సుందరరావు, బాబూరావు, పౌలు, స్వరూప, సువార్త, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి : వైద్యాధికారి

పెదనందిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి టి కమలాకర్‌రావు అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బందితో కలిసి నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు జరిగేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో స్టాక్ పరిశీలన

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్స్ పుస్తకాలు, మూడు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగ్‌లు తదితర వస్తువులను పంపిణీ కోసం సిద్ధం చేసిన స్టాక్ పాయింట్‌ను మంగళవారం జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ కార్ల అనీల్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా స్టాక్ పాయింట్లను పరిశీలిస్తున్న అధికారి మంగళవారం వట్టిచెరుకూరు జడ్పీ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు జిల్లా కో-ఆర్డినేటర్ చక్రవర్తి, మండల ఎంఈవోలు సత్యనారాయణమూర్తి, నిర్మల, మండల సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దుగ్గిరాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రాల ఏర్పాటు అవశ్యమని దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీబాయి అన్నారు. దుగ్గిరాలలోని పోస్టాఫీస్ సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద చలివేంద్రం శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ శిబిరంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు సేవలందిస్తుందన్నారు. హనుమంతరావు, పారిశుద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద, పోలీసు స్టేషన్ వద్ద ఉచిత చలివేంద్రాలను సర్పంచ్ మేడా బాబు మంగళవారం ప్రారంభించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల పాదచారులు ఇబ్బందులు పడకుండా నీటిని అందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

మారుతున్న రూపురేఖలు

● నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేశ్ సత్వర చర్యలు
● నేడు ఎస్ఎల్ఎన్ పార్కు ప్రారంభోత్సవం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ సత్వర చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వేగవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. మంగళగిరి ప్రజలు తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే.. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని ఎక్కువ నిధులు తీసుకువస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన మంత్రి లోకేశ్ మాటలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయి. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో వందకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ భూముల్లో దశాబ్దాల కాలంగా నివాసం ఉంటున్న మూడు వేల మంది పేదలకు శాశ్వత పట్టాలను అందజేస్తున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్ర మేనన్న మంత్రి లోకేశ్ దేశంలోనే మంగళగిరిని అన్ని రంగాల్లోనూ నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. పార్కులు, చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు కల్యాణ మండపాల నిర్మాణం, భూగర్భ డ్రెయినేజీ, భూగర్భ తాగునీటి లైను, భూగర్భ విద్యుత్, భూగర్భ గ్యాస్ అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆయా పనులను త్వరలోనే ప్రారంభించనున్నారు. మంగళగిరి ప్రజల దశాబ్దాల నాటి కల అయిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన శంకుస్థాపన చేసి ఏడాదిలో పూర్తి చేయను న్నారు. అలాగే, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో అభివృద్ధి చేసిన


మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీలో అభివృద్ధి చేసిన పార్కు

ఎస్ఎల్ఎన్ పార్కును బుధవారం సాయంత్రం లోకేశ్ ప్రారంభించనున్నారు. 35 సెంట్ల స్థలంలో రూ.1.06 కోట్ల వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. దీంతోపాటు నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా పార్కులు, చెరువులను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు ఈ నెలలోనే ప్రారంభం కానున్నాయి. నులకపేట, చినకాకానిలో లేక్ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలపై ప్రజల నుంచి హర్షాతిరే కాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కులను వదలి పేదల ఇళ్లను కూల్చడం అన్యాయం

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కే శ్రీనివాసరావు

మేడికొండూరు(నల్లపాడు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వాగు పోరంబోకు, వాటర్ వర్క్స్ భూముల్ని ఆక్రమించిన వైసీపీ నేతల జోలికి వెళ్లకుండా పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు విమర్శించారు. వెంగళాయపాలెంలోని ఎస్టీ కాలనీలో ఇళ్లను కూల్చి వేయడంతో నిరాశ్రయులైన పేదల్ని మంగళవారం పరామర్శించి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయకుండా కార్పొరేషన్ స్థలంలో ఉన్నాయంటూ పేదలు గుడిసెలు కూల్చి వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శ్రీరామనవమి పండుగ ముందు రోజు ఇళ్లను కూల్చివేసి నిలువ నీడ లేకుండా చేశారని ఆరోపించారు. నిరాశ్రయులైన పేదలు మూడు రోజులుగా ఎండకు ఎండుతూ పట్టాలు కట్టుకొని వాటి మాటున తలదాచుకుంటున్నారని చెప్పారు. ఎటువంటి నోటీసులు, ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసు బలగాలతో టీడీపీ కుటుంబాలకి చెందిన 20 ఇల్లులు కూల్చి వేశారని విమర్శించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు స్థానికంగా అందుబాటులో లేని


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సమయంలో పోలీసు బలగాలు, జేసీబీలు, మున్సిపల్ సిబ్బందితో పేదల గృహాలను సామాను సర్దుకునే అవకాశం ఇవ్వకుండా కూల్చివేయడం ఏమిటని, కేవలం టీడీపీ కుటుంబాలకు చెందిన ఇళ్లను మాత్రమే కూల్చేసి, వైసీపీ వాళ్ళను వదలి వేయడం ఏమిటో మున్సిపల్ అధికారులే చెప్పాలన్నారు.

నల్లపాడులో వెంచర్స్ వేసిన వాళ్ళు 2.67 ఎకరాల లేఅవుట్‌కు అప్రూవల్ తీసుకొని నల్లపాడు చెరువుభూమిని, వాగు పోరంబోకును కలుపుకొని 5 ఎకరాలలో లేఅవుట్ వేసి విక్రయిస్తున్నారని, నల్లపాడు చెరువు దాదాపు 100ఎకరాలు దానిలో నీళ్లు ఎక్కువగా ఉన్న ప్పుడు దాని నుంచి ఔట్ ఫ్లో వెళ్ళే వాగు మార్గాన్ని ఆక్రమించుకొని వెంచర్లు వేయడం వల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, చెరువు నిండితే నీరు బయటకు వెళ్లే మార్గం లేక నల్లపాడు గ్రామం, ఎస్సీ కాలనీ, హౌసింగ్ బోర్డు ప్రాంతాలు ముంపునకు గురవుతాయని అన్నారు. ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు వెంగళాయపాలెంలో పేదవాళ్లు నివసిసున్న ఇళ్లను వాటర్ బాడీస్ స్థలంలో ఉన్నాయనే సాకు చూపి వాటిని తొలగించిన అధికారులు నల్లపాడు చెరువు భూమిలోఉన్న వెంచర్లను ఎం దుకు తొలగించలేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి తీసుకువెళ్లి పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు.

నిరాశ్రయులకు నిత్యావసరాల పంపిణీ

కార్పొరేషన్ అధికారులు ఇళ్లను కూల్చివేయగా అక్కడే పరదాలు కట్టుకొని ఉంటున్న పేదలకు స్థానిక తెలుగుదేశం నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 50 కేజీల బియ్యం, పది కేజీల కందిపప్పు, 5 కేజీల వంటనూనెను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంగళాయపాలెం ఉప సర్పంచ్ మాధవి, టీడీపీ నాయకులు అవినాష్, బ్రహ్మం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మంగళగిరి సిటీ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ చేనేత జౌళిశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ రేఖారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాల కార్పొరేట్ విధానాల కారణంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. దీనివల్ల చేనేత కార్మికులు ఆకలిచావులు ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడంతో పరిశ్రమ మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని షెడ్డు కార్మికులకు, సహకార సంఘాల్లో నేత నేస్తున్న కార్మికులకు అమలు చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను రక్షిస్తామని జీఎస్టీ పూర్తిగా ఎత్తివేస్తామని రీయింబర్స్‌మెంట్ అమలు జరుపుతామని హామీలను ఇచ్చి నేటికీ అమలు చేయలేదని


చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

చెప్పారు. సహకార సంఘాలకు చెల్లించవలసిన యార్న్ సబ్సిడీ పావలా వడ్డీ రిబేటు రూ.156 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం రిబేటును సంవత్సరం మొత్తం కొనసాగించాలని నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి కార్మికుడికి అమలు జరపాలని, చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.రామారావు, నేతలు కే.వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతారామాంజనేయులు, కే.మల్లికార్జునరావు, ఎం.శివచంద్రరావు, కే.కుమారి, ఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో 10,11తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు - వాదాలు - సమాలోచన అనే అంశంపై బీఏఐఏఎస్ విభాగం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో బీఏఐఏఎస్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి శివనాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం యూనివర్సిటి వీసీ కే సారధివర్మ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుల మధ్య కుల, మత, విద్య, ఆర్థిక, లింగ, సాంస్కృతిక అసమానతలే ప్రధాన అంశంగా తెలుగు భాషలో ఆధునిక సాహిత్యం ఆవిర్భవించిందన్నారు. విభాగాధిపతి శివనాగయ్య మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాలలో జరిగే ఈ సదస్సుకు ఏపీ శాసనసభ మాజీ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర రోడ్డు సేఫ్టీ విభాగం డీఐజీ సీహెచ్ విజయరావు, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వైవో నందం, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ డి రాంబాబు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జీవీ పూర్ణచంద్, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, వాషింగ్‌టన్ నుండి ఇంగువ మాధురి, జర్మనీ యూనివర్సిటి ఆచార్యులు తొట్టెంపూడ ప్రసాద్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. వివరాలకు స్థానిక సహాయ ఆచార్యులు కే ప్రజాపతి, 9889949100లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రోవీసీలు ప్రసాద్, రాజశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాలను ఫలవంతం చేయాలి

● డ్వామా పీడీ బీ శంకర్

ఫిరంగిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ఇటు కార్మికులకు, అటు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని డ్వామా పీడీ బీ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని బేతపూడి, గుండాలపాడు, రేపూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఏపీడీ హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధి హామి పథకంలో చేపట్టే పనులన్నింటికీ మస్టర్ వెరిఫికేషన్‌ను పంచాయతీ కార్యదర్శులు చేయాలన్నారు. టార్గెట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీవో కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 జాతీయ ఫుట్‌బాల్‌కు క్రీడాకారుల ఎంపిక

ఫిరంగిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంనకు చెందిన వంగివరపు విలియమ్ స్మిత్, అనుముగుత్తి స్టాలిన్‌లు అండర్ - 19 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టు తరపున ఎంపికయ్యారని మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి బీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో జరిగే జాతీ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వీరిద్దరు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అబినందనలు తెలిపారు.


ఎంపికైన ఏ స్టాలిన్, విలిమ్ స్మిత్‌లు

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా వీరిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లి (చిర్రావూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్‌కు మంగళగిరి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా స్థానం కల్పిస్తూ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో కరోనా సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వీరిశెట్టి శ్రీనివాస్ సేవలు అందించారు. రైతుల తరపున పలు సమస్యలపై పరిష్కారానికి కృషి చేసిన వీరిశెట్టి శ్రీనివాస్‌కు మంత్రి లోకేశ్ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా స్థానం కల్పించడంపై గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపి వీరిశెట్టి శ్రీనివాస్‌ను మంగళవారం సాయంత్రం సత్కరించారు. తనకు డైరెక్టర్ పదవి ఇచ్చిన లోకేశ్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా తాడేపల్లి పట్టణం, మండలాలకు చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు (తాడేపల్లి), వల్లభాపురం స్వర్ణకుమారి (ఉండవల్లి), వీరిశెట్టి శ్రీనివాసరావు (చిర్రావూరు), షేక్ మస్తాన్ (తాడేపల్లి) తదితరులకు కూడా మార్కెట్ యార్డు డైరెక్టర్ పదవులు లభించాయి.

గ్యాస్, పెట్రో ధరలను వెంటనే తగ్గించాలి

● సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్ నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నేతలు కంచర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆత్మకూరు గ్రామ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. సీపీఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో రూ.400 వున్న గ్యాస్ ధరను రూ.1100 వరకు పెంచిందని, అనేక ఆందోళనల నేపథ్యంలో గతేడాది ఎన్నికల సందర్భంగా రూ.300 తగ్గించిందని చెప్పారు. కేంద్రం పెంచిన ధరలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలని, పెంచిన ధరలను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గడ్డం అజయ్‌కుమార్, చిట్టేల సీతారామాంజనేయులు, జనార్ధనరావు, వద్ది సుబ్రహ్మణ్యం, దేవూరు పద్మనాభ శర్మ, సురేష్, గౌరబత్తుల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్, పెట్రో ధరల పెంపును నిరసిస్తూ ర్యాలీలో నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

తాడేపల్లి (గుండిమెడ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుండిమెడలో మంగళవారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ ఓ వైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు సతమతమవుతుంటే బీజేపీ ప్రభుత్వం ఒక్కసారిగా గ్యాస్ రేటు రూ.50 పెంచిందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యాదర్శి పల్లె కృష్ణ, నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సామ్యవాదం తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలో కూడా రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి ఆధ్వర్యంలో గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

● **తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ, కూటమికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి, బాబూరావు, బాష, తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో గ్యాస్ సిలెండర్లతో నిరసనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇమ్మడి రామారావు, శృంగారపాటి బాబురావు, జోన్న కోటిరెడ్డి, బాణావత్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ, శివాలయం ట్రస్టుబోర్డు డైరెక్టర్ల నియామకం

మంగళగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ, శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం) ట్రస్టుబోర్డు కార్యవర్గాలను పూర్తిస్థాయిలో నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జవ్వాది కిరణ్‌చంద్, వైస్‌చైర్మన్‌గా యర్రగుంట్ల భాగ్యారావు, డైరెక్టర్లుగా నైనాల లావణ్య, జగ్గారపు నాగకుమారి, మేడిశెట్టి కిశోర్, షేక్ తస్లీమ్, బైరబోయిన పద్మావతి, మాన్యం మల్లేశ్వరీ, ఎంరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, నల్లగొండ పరమేశ్వరరావు, ఉయ్యాల శ్రీనివాసరావు, వల్లభాపురం స్వర్ణకుమారి, వీరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, నక్కా రాజేశ్వరీ నియమితులయ్యారు. శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావు, సభ్యులుగా సుఖమంచి గిరిబాబు, జంజనం వెంకట సుబ్బారావు, తిరుమలశెట్టి మురళీ కృష్ణ, ఇసుకపల్లి వెంకట లలిత, ఉడతా లావణ్య, చిలకా బసవమ్మ, బాపనపల్లి వాసు, ఆకునూరి కరుణ నియమితులయ్యారు. ఆయా కమిటీల్లో తమకు అవకాశం కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కు చైర్మన్లు, సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

పెదనందిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. పెదనందిపాడు పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు ఎస్ఐ మధుపవన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నేరాల నియంత్రణ కోసం స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. విలేజ్ మహిళా పోలీసులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, గ్రామాల్లో తరచూ పర్యటించాలన్నారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే పెట్రో కార్ సిబ్బంది స్టేషన్ పరిధిలోని పాతనేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నల్లమడ రైతులపై పెట్టిన కేసులు కోర్టుకు సిఫారసు చేశారని, తీర్పు రాగానే త్వరలో ఎత్తివేస్తామని తెలిపారు. అనంతరం పాతబస్టాండ్ సెంటర్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు వెళ్లే విధంగా చూడాలని చెప్పారు. ఆయన వెంట సీఐ గన్నవరపు శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్, సిబ్బంది ఉన్నారు.


స్టేషన్‌లో లాకప్ గదులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కుంచనపల్లిలో స్వచ్ఛ మంగళగిరి


స్వచ్ఛ మంగళగిరిలో పాల్గొన్న అధికారులు, స్థానికులు, కూటమి నేతలు

తాడేపల్లి (కుంచనపల్లి) , ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి పరిసర ప్రాంతాల్లో మంగళవారం స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పారిశుధ్య పనులు చేసి చెత్తను తొలగించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ తడిచెత్తను, పొడిచెత్తను వేరుగా ఉంచి కార్మికులకు అందించాలని కోరారు. ఎల్లప్పుడు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు, ఈగలు, వ్యాధుల నుంచి తప్పినట్టు అవుతుందని చెప్పారు. అనంతరం నాయకులు, కార్మికులతో కలిసి చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అలీంబాషాతోపాటు డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, డీఈ రాము, ఏఈ అనూష, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, గ్రామ జనసేన అధ్యక్షుడు మేకల రాజా, స్థానికులు కోలంటి మాణిక్యాలరావు, సురేష్, మహేంద్ర ప్రవీణ్, బిరుదుగడ్డ రమేష్, ఎంటీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మలినేనిలో పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు


మలినేనిలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశ పరీక్షలకు నిష్ణాతులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పీ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పాలిటెక్నికల్ కోర్సులపై ఆసక్తి గల వారు ప్రవేశానికి నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ సూచించారు. తరగతులకు హాజరయ్యే వారి కోసం ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నట్టు కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు వెల్లడించారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి : ఎంపీడీవో

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుండి వారంలో రెండు రోజులు చెత్త సేకరణ చేయాలని ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పెదనందిపాడు మండల క్లాప్ మిత్రలు, సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానం తెలియజేయాలన్నారు. తుమ్మలపాలెం సర్పంచ్ చల్లా నాగమల్లీశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెదనందిపాడు ఎంపీడీవో పద్మావతి, ఈవోపీఆర్డి రవికుమార్, స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి

దుగ్గిరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి, కనీస వేతనాలు అందించాలని గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సంఘ జిల్లాకార్యదర్శి చింతల శ్రీనివాసరావు అన్నారు. ఈమనిలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కొందరికి మూడు, నాలుగు నెలలపాటు వేతనాలందక కిరాణా దుకాణాల్లో అప్పులు కూడా ఇవ్వక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల 11వ తేదీన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి వారి సమస్యలను తెలియ జేయనున్నారన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి గొట్టిపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఎస్. దాసు, గౌరి, రాణి, శౌరి, పొలేసు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక వేములపల్లి

మంగళగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా గేయం ద్వారా వేములపల్లి శ్రీకృష్ణ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే, కవి వేములపల్లి శ్రీకృష్ణ వర్ధంతి సందర్భంగా మంగళగిరి సీపీఐ కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు పిల్లలమర్రి నాగేశ్వరరావు, జాన్‌బాబు, సత్యనారాయణ, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో జీబీసీ రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గుంటూరు వైపు నుంచి పొన్నూరు వస్తున్న కారు చీరాల నుంచి గుంటూరు వైపు వెళుతున్న కార్లు పట్టణ శివార్లులో ఢీ కొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై అర్బన్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

నేడు రుణమేళా

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణమేళా ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఈబీసీ కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు సంబంధించిన లబ్ధిదారులు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి రుణమేళా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పా రు. కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రుణమేళాకు హాజరు కావాలని సూచించారు.

ఇంటి పన్ను చెల్లించి రాయితీ పొందండి: కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నును ముందస్తుగా చెల్లించి రాయితీని పొందండని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను అస్తి పన్నును ఈ నెల 30 తేదీలోపు ఏక మొత్తంగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీని ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

తెనాలి క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాజరుపేటకు చెందిన మోరం రవి తన భార్య శ్రావణి (38) కనిపించడం లేదని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4వ తేదీన షాపింగ్ కోసం భార్యను గాంధీచౌక్‌లో దింపి స్కూల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకు రావడానికి వెళ్లాడు. తిరిగి భార్యను తీసుకు వెళ్లడానికి గాంధీచౌక్‌కు రాగా ఆ ప్రాంతంలో భార్య కనిపించలేదు. అప్పటి నుంచి బంధు మిత్రులను విచారించి, వివిధ ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు అందించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్పీల చేతివాటంపై డ్వాక్రా మహిళల బెంబేలు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో పేదరిక నిర్మూలన కోసం మెప్మా విభాగంలో ఏర్పాటుచేసిన ఆర్పీల చేతివాటంతో డ్వాక్రా మహిళలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో పురపాలక సంఘం మెప్మా పరిధిలో సుమారు 2810 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఆయా గ్రూపులకు ఆర్పీలుగా ఉన్న మహిళలు గ్రూపు సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.2వేలు నుంచి రూ.3 వేలు డిమాండ్ చేస్తుండటంతో డ్వాక్రా మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదిమంది సభ్యులు గ్రూపుగా ఏర్పడితే బ్యాంకుల ద్వారా లోను రూపంలో నగదు అందించాల్సి ఉంటుంది. బ్యాంకర్లకు డ్వాక్రా సంఘాలకు మధ్య ఆర్పీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. దీంతో లోనుకోసం గ్రూప్ సభ్యులు ఆర్పీలను సంప్రదించడం వారు అడిగిన నగదును ఇస్తేనే లోను శాంక్షన్ చేయిస్తామని ఆర్పీలు డిమాండ్ చేస్తుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు అడిగినంత నగదును చెల్లిస్తూ రుణ సదుపాయాలను పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్పీల చేతివాటానికి అలవాటుపడి ప్రభుత్వం మారిన తరువాత కూడా ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నరన్న విమర్శలు కూడా పలువురి నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఆర్పీల తీరుపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో వీరి ఆగడాలు రోజురోజుకి శృతిమించుతున్నాయని, డ్వాక్రా మహిళల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్పీల వ్యవహార శైలిపై దృష్టి సారించాలని డ్వాక్రా సంఘాల మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

పాత్రికేయుడు భూషణంకు అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయుడు భూషణంకు అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డును టాలెంట్ ఎక్స్‌ప్రెస్, శ్రీశ్రీ మీడియా సభ్యులు అందజేశారు. స్థానిక గాంధీచౌక్‌లోని హోటల్ ప్రిన్సెస్‌లో టాలెంట్ ఎక్స్‌ప్రెస్, శ్రీశ్రీ మీడియా సభ్యులు పాత్రికేయుడు భూషణంకు అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణలు పాల్గొని ఈ అవార్డును అందించారు.

మహాప్రస్థాన సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహా ప్రస్థాన సేవా సమితి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. 2025-28 కాలానికి గాను గౌరవ అధ్యక్షుడిగా బండి సాంబశివరావు, అధ్యక్షుడిగా డాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెట్టి శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారిగా తుమ్మల బాపయ్య చౌదరి ఎన్నిక కాగా సభ్యులుగా శంకరప్రసాద్, సత్యనారాయణ, శంకరరావు, గంగాధరరావు, ఆదినారాయణ, రమణయ్య, వేణు, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, గిరీష్, ఈశ్వర్‌చంద్, సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

గ్రాసంకోసం డెల్టాకు జీవాల వలస

● తగినంత లభ్యమవుతుండటంతో పశుపోషకుల్లో ఆనందం



డెల్టా ప్రాంతానికి వలస వస్తున్న జీవాలు



కొల్లిపర ప్రాంతంలోని మాగాణి భూముల్లో మేస్తున్న ఆవులు

కొల్లిపర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతం వలస పశువులకు వరంగా మారింది. వరి మాగాణి రబీ పంటగా మొక్కజొన్న, జొన్న సాగుచేస్తున్న డెల్టా ప్రాంతం వైపు పశుపోషకులు వలసల బాట పట్టారు. ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి వందలాది పశువులు, ఆవులు, గొర్రెలతో తరలివస్తున్నారు. పశువులతో పాటుగా మహిళలు, పిల్లలతో పశుపోషకుల కుటుంబాలు డెల్టా ప్రాంతంలో కన్పిస్తున్నారు. వరి మాగాణిలో జొన్న, మొక్కజొన్న రబీ పంటలు రైతుల చేతికి పంట అందివచ్చిన ప్రస్తుత దశలో పచ్చిమేతగా జొన్న, మొక్కజొన్న చొప్ప వ్యర్థాలు విస్తృతంగా లభిస్తుండటంతో వలస పశువులకు మేత సమస్య తీరుతోంది. పశువులకు, పోషకులకు తాగునీరు సమృద్ధిగా దొరకటం, పంట నూర్పిడి చేసిన పొలాల్లో మిగిలిన జొన్న, మొక్కజొన్న పంటలు పచ్చిమేతగా లభిస్తోంది. పశుపోషకుల కుటుంబాలు మహిళలు, పిల్లలతో సహా తరలి వచ్చి వేసవి కావడంతో మాగాణి పొలాల్లోనే రాత్రిళ్ళు ఆరు బయటనే నిద్రిస్తున్నారు. పగటి సమయంలో పశువులకు మేత మేపుకోవటం ఎండ విపరీతంగా ఉన్న సమయంలో చెట్ల నీడల్లో పశుపోషకులు విశ్రాంతి తీసుకుంటున్నారు. రాత్రిళ్ళు పొలాల్లో ఆవులు, గొర్రెల మందలను విడిది చేయించటం వల్ల రైతుల నుంచి కొంత ఆదాయం పశుపోషకులకు లభిస్తోంది. దీంతో పశుపోషకులకు జీవనాధారం దొరుకుతోంది. స్థానిక రైతులకు కూడా సులభంగా సేంద్రియ ఎరువులు లభ్యం అవుతుండటంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వందలాది పశువులు, గొర్రెలు ప్రధాన రహదారులపై ప్రయాణం చేయడంతో డెల్టా ప్రాంతంలో తరుచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అయితే తీవ్ర ఎండల వలన పశుపోషకుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వారికి తగిన వైద్య సదుపాయాలను ఉచితంగా ఏర్పాటుచేస్తే బావుంటుందని పలువురు సూచిస్తున్నారు.

కొల్లిపర మండలంలో గాలి, వాన

● తడిచిన జొన్న, మొక్కజొన్న, పసుపు పంటలు
● ఆందోళనలో రైతన్నలు





కొల్లిపర మండలం తూములూరులో జలమయమైన రోడ్డు, కొల్లిపరలో వర్షానికి పూర్తిగా తడిచిపోయిన ఇటుకరాయి

కొల్లిపర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురియడంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి గాలులతో కూడిన వర్షం పడింది. కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు పంటలు పలుచోట్ల పూర్తిగా తడిచిపోయాయి. చేతికి వచ్చిన పంటలు తడిచిపోవడంతో ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ముందుగా మబ్బులు పట్టడంతో కొంతమంది రైతులు హడావిడిగా కల్లాలో ఉన్న పసుపు, మొక్కజొన్న, జొన్నలను ట్రాక్టర్ల ద్వారా గృహాలకు తరలించారు. మరికొంతమంది రైతులు కల్లాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపుపై పట్టాలు కప్పి పంటను రక్షించుకున్నారు. పలు గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు కోత కోసి పొలంపై అక్కడక్కడ ఆరబెట్టి ఉంచడంతో వర్షానికి తడిచిపోయాయి. వర్షం పడటంతో తడిచిన మొక్కజొన్న, జొన్నలు దెబ్బతింటాయోమోనని రైతులు భయపడుతున్నారు. పట్టాలు కప్పిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు కూడా తడవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షంతో పాటు గాలి వేయడంతో మండలంలో పలు చోట్ల అరటి చెట్లు పడిపోయాయి. పంట దశకు వచ్చిన అరటి గెలలు పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షం కారణంగా ఇటుక పరిశ్రమ రైతులకు అపారమైన నష్టం వాటిల్లింది. ఇటుక రాయి తడిచిపోవడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు ఇటుక పరిశ్రమ రైతులు వాపోయారు.



చెత్త సేకరణపై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న తదితరులు

చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. మంగళవారం 15వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శేషన్న అధికారులతో మాట్లాడుతూ మురుగు కాలువలలో సిల్ట్‌ను ప్రతిరోజు తొలగించాలని, తొలగించిన సిల్ట్‌ను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. చెత్తను పారిశుధ్య కార్మికులు ఇళ్లనుంచి సేకరిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చెత్తను ఇంటి నుంచి సేకరించే విషయంలో ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ సెక్రటరీలను స్వచ్ఛ్ సర్వేక్షన్ సర్వేను నిర్ణీత సమయంలో లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట, కొల్లిపర, తూములూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతినెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల పురోగతిని వారికి తెలియజేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



అన్నవరంగౌడపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

వేసవిలో గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గర్భిణులు ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని మండల వైద్యాధికారి ఎస్.సుమంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరంగౌడపాలెంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ వేసవి కాలంలో నిల్వఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిదికాదన్నారు. వైద్యుల సలహా మేరకు గర్భిణులు ప్రతి రోజు మందులను వేసుకోవాల్సిందేనన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ జానీబేగం, ఏఎన్ఎమ్‌లు మేరిమ్మ, ఆదిలక్ష్మి, హెల్త్‌అసిసెంట్ శ్రీనివాసరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బస్‌స్టేషన్ వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్స్

అధ్వానంగా సులభ్ కాంప్లెక్స్‌లు

● పగిలిపోయిన టాయిలెట్లు ● చిల్లులుపడిన డోర్లతో ఉన్న వైనం



సర్కిల్‌లో తుప్పుపట్టి బెజ్జాలు పడిన డోర్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్నేళ్ల క్రితం వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారి వినియోగానికి పనికిరాకుండా పోతున్నాయి. పగిలిపోయిన ఫ్లోరింగ్, తుప్పుపట్టి సగం వరకు బెజ్జాలు పడిన తలుపులు, పగిలిపోయిన టాయిలెట్ సీట్లు, వినియోగానికి వెళ్లిన వారికి దర్శనమిస్తున్నాయి. దీంతో వీటివంక చూడాలంటేనే జనం భయపడుతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సులభ్ కాంప్లెక్స్‌ల వంక మున్సిపాలిటీ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. వాడుకోవడానికి తగిన బక్కెట్లు, మగ్గులు కూడా వీటిలో లేకపోవడం, నీరు నిల్వ చేసే తొట్టిల్లో పాచి పేరుకుపోవడం, టాయిలెట్ల లోపల ట్యాప్‌లు సక్రమంగా పనిచేయకుండా ఉంటున్నాయి. ఈ కారణంగా వీటిని వినియోగించుకోవడానికి ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. బహిరంగ ప్రదేశాలలోనే మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో పట్టణ పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మూత్రశాలల నిర్వహణ కూడా అధ్వానంగానే ఉన్నాయి. కొన్నిచోట్ల పైకప్పులు విరిగిపోయి, నీళ్ల అందుబాటులో లేకపోయినా అలాంటి మూత్రశాలలనే వినియోగించుకోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, దుకాణదారులు తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నారు.

బహిరంగ మూత్ర విసర్జనపై చర్యలేవి?

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో బహిరంగ మూత్రవిసర్జన నిషేధం అమలయ్యేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో పురపాలక సంఘం వారు బహిరంగంగా మూత్ర, మల విసర్జనను చేయడాన్ని నిషేధిస్తున్నామని దీనిని అతిక్రమించిన వారికి పురపాలక సంఘం చట్టం ప్రకారం భారీగా జరిమానాలను విధిస్తామని ప్రకటించారు. అధికారులు ఆర్భాటపు ప్రచారాలే తప్ప క్షేత్రస్థాయిలో వాటి అమలుకు చర్యలుండటం లేదని పలు ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. స్వచ్ఛ తెనాలి అని ఊదర కొట్టటమే తప్ప క్షేత్రస్థాయిలో వాటి అమలుకు చర్యలుండటం లేదు. పట్టణంలో పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వాటర్‌లెస్ టాయిలెట్ల నిర్వహణ సరిగా లేక వాటి వినియోగం అంతంతమాత్రమే. మునిసిపల్ అధికారులు సులభ్ కాంప్లెక్స్‌లను, మూత్రశాలలను వినియోగించుకునేలా వీటిని తీర్చిదిద్దాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

● జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. మంగళవారం స్థానిక సుల్తానాబాదులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మురళీకృష్ణ సుబ్బరాయణం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రతి నెల వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ ఊరబిండి మహిత మాట్లాడుతూ గర్భిణులు కాన్పులకు ప్రభుత్వ వైద్యశాలలో చేరాలన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలుగా పనిచేస్తాయన్నారు. అనంతరం గంగానమ్మపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మహిత, డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్, పట్టణ అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివప్రసాద్, హెల్త్ విజిటర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్రత పూజ చేస్తున్న దంపతులు

నవమి వేదికలపై సత్యనారాయణ స్వామి వ్రతాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ నవమి ఉత్సవాలు జరుపుతున్న వేదికలపై మంగళవారం శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపారు. బోసురోడ్డులోని హనుమాన్ చౌక్‌లో సీతారామ మందిరంలో 93వ వార్షిక వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలలో భాగంగా వ్రత పూజలు అంజనేయశాస్త్రి, లక్ష్మీ ప్రసన్న దంపతులతో యాగ్నికులు మెట్టా పార్థసారథి శర్మ నిర్వహించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గాడిబావిసెంటర్‌లో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. ధ్వజావరోహణ చేసి గరుడ ముద్దల ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈవో అమర్‌నాథ్, అర్చకులు జంధ్యాల గురునాథశాస్త్రి పర్యవేక్షించారు. స్వామి వారిని శ్రీలక్ష్మీ హైగ్రీవ అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీసీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు నిత్య ప్రసాదం పంపిణీ చేశారు. మారీసుపేట అప్పలస్వామి ఆలయం, బాలాజీరావుపేట పట్టాభి రామస్వామి ఆలయం, అంగలకుదురు దాస కోటి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడు డక్కుమళ్ల రాంబాబు కుటుంబానికి కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. డక్కుమళ్ల రాంబాబు ఇటీవల బాపట్ల జిల్లాలో పనికి వెళ్లి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు రూ. 16,600 సాయాన్ని అందించారు. సంక్షేమ బోర్డు నుంచి రాంబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రోశయ్య, హెబ్‌నైజర్‌బాబు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురులోని శ్రీభూలీల సమేత చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, నిర్వహించి కంకణధారణ చేశారు. ఉత్సవాలకు అంకురారోపణ చేసి నవ కుంభారాధన అగ్ని ప్రతిష్ఠ, వాస్తుహోమం జరిపారు. హోమం జరిపి దేవి పూజ నిర్వహించారు. ఉత్సవాల అంకురారోపణ సందర్భంగా ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ భూలీలా సమేత చెన్నకేశవస్వామి



వల్లభాపురంలో ఉపాధిహామీ పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో వెంకయ్య

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలి

● ఏపీవో వెంకయ్య

కొల్లిపర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల కూలీలు సమయ పాలనను తప్పనిసరిగా పాటించాలని ఏపీవో వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేదప్రజలకు ఉపాధి కల్పించటానికే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.